అంశం: 21

# అభివృద్ధి పథకాల ప్రభావాన్ని అంచనావేద్దాం

## లక్ష్యం:

1. అభివృద్ధి కార్యక్రమాల వలన కలిగే ఉపయోగాలను, ఇబ్బందులను అవగాహన చేసుకుందాం.
2. అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేసేముందు వాటి ప్రభావాన్ని అంచనా వేయాల్సిన అవసరాన్ని గుర్తిద్దాం.
3. ఏ అధ్యయనంలోనైనా సమగ్ర దృక్పథం అలవడేలా వైఖరులను అభివృద్ధిచేయటం.



## నేపథ్యం:

దేశ పురోభివృద్ధికి వివిధ క్షేత్రాలలో అభివృద్ధి అత్యవసరం. కాని చాలా అభివృద్ధి కార్యక్రమాలు సాంఘిక, ఆర్థిక, పర్యావరణాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. మానవ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే సమాజం, పర్యావరణంపై పారిశ్రామికీకరణ ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు స్పష్టమైన ఉదాహరణలు ఉన్నాయి. అందువల్ల ఏ అభివృద్ధి ప్రణాళికనైనా అమలు చేసేముందు దాని ప్రభావంపై సమగ్రంగా అంచనా వేయటం ముఖ్యమైన అంశం. అప్పుడు అభివృద్ధిక్రమం సుస్థిరంగా ఉండి పర్యావరణం, సమాజాలపై దుష్ప్రభావం తక్కువగాను ఉంటుంది.




## పద్ధతి:

1. మీ రాష్ట్రం, జిల్లాలో ఏదైనా ఆనకట్ట కట్టడానికి ప్రతిపాదనలు ఉన్నాయేమో తెలుసుకోండి.
2. ఉంటే సంబంధిత సమాచారం వివిధ మూలాల నుండి సేకరించండి.
   ఎ) ఆనకట్ట నిర్మించడానికి ప్రతిపాదిత ప్రాంతం.
   బి) ఎంత పరిమాణంలో అటవీ ప్రాంతాలు, సారవంతమైన వ్యవసాయ భూమి ధ్వంసం చేయబడుతున్నది.
   సి) ఆవాసప్రాంతాలను ధ్వంసం చేసినట్లయితే ఆ ప్రాంతంలో నివసించే జంతు, వృక్ష జాతులకు ఏవిధమైన ప్రమాదం కలగవచ్చు?

డి) ఎంత మంది ప్రజలు అక్కడి నుంచి తరలించబడుతున్నారు. వారి పునరావాసం కొరకు ప్రభుత్వం చేపట్టే చర్యలు.

ఇ) ఆనకట్ట ద్వారా ఎంత పరిమాణంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయబడుతుంది. స్థానిక ప్రజలకు ఒనగూరే ప్రయోజనాలు ఏమైనా ఉంటే గుర్తించండి.

ఎఫ్) ఆనకట్ట నిర్మాణం భూకంప ప్రభావిత ప్రాంతంలో ఉందా?

జి) ఆనకట్ట నిర్మాణ వ్యయం లాభదాయకమేనా?

హెచ్) ఈ రకమైన అధ్యయనాలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై కూడా చేయండి. ఉదాహరణకు ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, వంతెనలు, హోటళ్ళు, పర్యాటక కేంద్రాలు, పెద్ద వ్యాపార సముదాయాలు మొదలైనవి.

**ముగింపు:**

అభివృద్ధి పేరిట జరిగే కార్యక్రమాలు ఏదో ఒక విధంగా పర్యావరణాన్ని దెబ్బతీసేవిగానే ఉంటాయి. ఒక ప్రాజక్టును నిర్మిస్తే ఎన్నో జంతువులు, జాతులు కనుమరుగవుతాయి. జీవవైవిధ్యం నాశనమవుతుంది. బహుళ అంతస్తు భవనాలు, వ్యాపార కేంద్రాలు, వంతెనలు, రహదారులు ఏవి నిర్మించినప్పటికీ ఇవన్నీ పర్యావరణ సమస్యలు సృష్టిస్తూనే ఉంటాయి. వీటిని పూర్తిగా నిరోధించడం సాధ్యం కాదు. అభివృద్ధి కోసం చేపట్టే చర్యలు పర్యావరణ అనుకూలంగా ఉండేలా చూడాలి. 'ఒక చెట్టు నరకాలంటే ఒక మొక్క నాటాలి' అనే నినాదం అమలు చేయాలి. ఇలా సుస్థిరమైన అభివృద్ధి కోసం ఏమేమి చేయవచ్చో ఆలోచించండి.

మీరు సేకరించిన సమాచారం ఆధారంగా పెద్ద పెద్ద ప్రాజెక్టుల వల్ల కలిగే లాభనష్టాలను గుర్తించండి. నష్టాలు, ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని సాధ్యమైన పరిష్కారాలు ,ప్రత్యామ్నాయాలు సూచించండి.

**తదుపరి చర్యలు:**

1. అభివృద్ధి కార్యక్రమాలు ఏ విధంగా పర్యావరణం దెబ్బతినడానికి కారణమవుతున్నాయో. స్థానిక ప్రజలు వాటికి వ్యతిరేకంగా ఎందుకు నిరసన తెలుపుతున్నారో చర్చించండి.

2. మీ ఊరిలో ప్రభుత్వం ఏఏ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వాటి వల్ల ఎంతమంది లబ్ధి పొందుతున్నారు? అవి అందరికి అందుబాటులో లేకపోవడానికి కారణాలు ఏమిటి?

అంతరించిపోతున్న 'ఆలివ్ రిడ్లే' అనే సముద్ర తాబేళ్ళు శీతాకాలంలో గుడ్లు పెట్టడానికి తమిళనాడు నుండి ఒడిశాకు వలసపోతాయి. తమిళనాడు తీరప్రాంతంలో సేతు సముద్రం నౌకాశ్రయాన్ని మొదలుపెట్టిన తరువాత తాబేళ్ళు తమ వలస మార్గాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. ఈ సందర్భంలో ఎన్నో తాబేళ్ళు చనిపోయాయి.